క్లుప్తంగా

అలరించిన భక్తిరంజని



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో బుధవారం విజయవాడకు చెందిన శ్రీదమని ఆర్ట్స్‌కు చెందిన కళాకారులు ఆలపించిన భక్తి గీతాలు అందరినీ అలరించాయి. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై దమని ఆర్ట్స్ వ్యవస్థాపకులు మాదుగుల లక్ష్మణరావు బృందం పలు భక్తి గీతాలను ఆలపించింది. దండు చంద్రశేఖర్, తల్లపురెడ్డి శ్రీనివాసరెడ్డి, రజనీ, రూపశ్రీ, కుసుమలు పాటలను పాడగా, వారికి కీబోర్డుపై రవి, పాడ్స్‌పై లక్ష్మణ్, తబలాపై వై.రాజు, కాంగో డ్రమ్స్‌పై వెంకటరమణ, డోలక్‌పై మాదుగుల ఏడుకొండలు చక్కటి సహకారం అందించారు. భక్తి గీతాలను ఆలపించిన బృందాన్ని ఆలయ ఈవో కెఎస్.రామరావు అభినందించి అమ్మవారి ప్రసాదాలు, దేవస్థాన ప్రసంశాపత్రాలు అందించారు.

మహాలక్ష్మీ అమ్మవారి హుండీ ఆదాయం రూ.3.61 లక్షలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్‌లోని శ్రీమహాలక్ష్మీ అమ్మవారికి భక్తులు హుండీల ద్వారా రూ. 3,61,945 నగదును కానుకలు, మొక్కుబడులుగా సమర్పించారు. అమ్మవారికి భక్తులు సమర్పించిన కానుకలను బుధవారం ఆలయ ఆస్థాన కల్యాణ మండపంలో లెక్కించారు. కానుకల లెక్కింపు కార దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సుజన్, ఆలయ కమిటీ అధ్యక్షుడు లింగిపిల్లి అప్పారావు, కార్యదర్శి హనుమంతరావు కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు, పోతిన బేసుకంతేశ్వరుడు, బెవర సూర్యనారాయణ, పణుకు రమా, యీది ఎల్లారాజారావు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



భవానీపురం(విజయవాడపశ్చిమ): చిట్టినగర్ పాల ఫ్యాక్టరీ ఫంక్షన్ హాల్ ఎదురుగా కొండ ప్రాంతంలోని యానాదుల సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులకు బుధవారం రాత పుస్తకాలు, పెన్నులు, బిస్కట్లు పంపిణీ చేశారు. విద్యాధరపురం కబేళా సెంటర్‌కు చెందిన వెంకట్ మహేశ్వర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కొప్పాడి రితిక జన్మదినాన్ని పురస్కరించుకుని ఆ చిన్నారి తల్లిదండ్రులు కొప్పాడి యేసురాజు, అరుణ దంపతులు, కుటుంబసభ్యులు హర్ష తేజ, చింతా ఆదిలక్ష్మి ఆర్థిక సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వంగవీటి రంగా స్కూల్‌లో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ దుర్గా కిషోర్, సెక్రటరీ విజయలక్ష్మి, సభ్యులు అరుణ, కోమలి, వేముల కుమారి, రూప, శ్రవణ్, టీచర్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీపురం పరిధిలోని 11 కేవీ మసీద్ ఫీడర్ లైన్ల మరమ్మతులలో భాగంగా కొన్ని ప్రాంతాలలో మూడు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ (విజయవాడ టౌన్) పి.రవీంద్రబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు ఐటీసీ పెట్రోల్ బంక్, అల్లుడి పేట, బాలభాస్కర నగర్, రాజేంద్ర వీధి, నాగార్జున వీధి, మసీదు వీధి, రంగూన్ సాహెబ్ వీధి, ప్రెసిడెంట్ వీధి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వివరించారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

సింగల్ యూజ్ ప్లాస్టిక్‌పై స్పెషల్ డ్రైవ్



పటమట(విజయవాడతూర్పు): నగరంలో పెరిగిపోతున్న సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నేపథ్యంలో విజయవాడ నగరపాలక సంస్థ బుధవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించింది. వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాలతో ప్రజారోగ్య విభాగం మూడు సర్కిళ్ల పరిధిలోని ఆయా డివిజన్లలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో సింగిల్ యూస్డ్ ప్లాస్టిక్ విక్రయిస్తున్న పలు వ్యాపార సంస్థలను శానిటరీ ఇన్‌స్పెక్టర్లు తనిఖీ చేశారు. సూపర్‌మార్కెట్, కూరగాయలు, హోల్‌సేల్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి సింగిల్ యూస్డ్ ప్లాస్టిక్ విక్రయిస్తున్న వారికి జరిమానా విధించారు. నగరంలో సింగిల్ యూస్ ప్లాస్టిక్ వినియోగించవద్దని, పర్యావరణాన్ని పరిరక్షించేందుకు పర్యావరణహిత వస్తువులనే వాడాలని సూచించారు. వ్యాపారులు సింగల్ యూస్ ప్లాస్టిక్ విక్రయించినా, వినియోగించినా కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రమాదాలకు కేరాఫ్ పున్నమి జంక్షన్

- ట్రాఫిక్ నియంత్రణను పట్టించుకోని పోలీసులు
- నిత్యం ప్రమాదాల బారిన పడుతున్న ప్రయాణికులు



పున్నమి హోటల్ జంక్షన్ వద్ద ఇష్టారాజ్యంగా వాహనాల రాకపోకలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): జాతీయ రహదారి అంటేనే నిత్యం వందలాది వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన లేని కొందరు, ఉన్నా పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా వాహనాలను నడిపేవారు మరి కొందరితో ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా యువత మితిమీరిన వేగంతో వాహనాలను నడిపే తీరు చూసి ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ట్రాఫిక్ పోలీసుల నియంత్రణ లేకపోవడంతోనే ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, నిబంధనలను ఉల్లంఘించే వారికి భారీ జరిమానాలు విధిస్తే తప్ప వారు దారిలోకి రారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్ దాటిన తరువాత భవానీపురం పరిధిలోని పున్నమి హోటల్ జంక్షన్ వద్ద నిత్యం రద్దీగా ఉంటుంది. దాదాపు ఆరు వైపుల నుంచి (కుమ్మరిపాలెం సెంటర్ రెండు వైపులా ఉన్న రహదారి గుండా, భవానీపురం ఆర్టీసీ వర్క్‌షాప్ వైపు నుంచి, భవానీపురం పెట్రోల్ బంక్ వైపు నుంచి (వన్‌వేలో సైతం), పున్నమి ఘాట్ వైపు నుంచి, కరకట్ట సౌత్ రోడ్ నుంచి రాకపోకలు సాగించే వాహనాలన్నీ పున్నమి హోటల్ జంక్షన్ వద్దకు చేరుకుంటాయి. దీంతో అక్కడ ట్రాఫిక్ గందరగోళంగా నెలకొంటుంది. కొన్ని వైపుల వన్‌వే మార్గం అయినప్పటికీ అదేమీ పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా వాహనాలు దూసుకువెళుతున్నాయి.



పున్నమి హోటల్ ఎదుట ఫ్లై ఓవర్ కింద ఆటోలు, బండ్లతో ఇరుకుగా మారిన మార్గం

జిగ్‌జాగ్‌గా బారికేడ్లు ఏర్పాటు చేయాలి

గతంలో పున్నమి హోటల్ జంక్షన్ దగ్గర జిగ్‌జాగ్‌గా బారికేడ్లు ఏర్పాటు చేసినా అది తాత్కాలికమే కావడంతో ఎవరు ఎటువైపు నుంచి రాకపోకలు సాగిస్తున్నారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఇటీవల కుమ్మరిపాలెం సెంటర్ వైపు నుంచి ఒక కారు మితిమీరిన వేగంతో వస్తూ కనకదుర్గ ఫ్లై ఓవర్ కింద నుంచి వస్తున్న మరో కారును బలంగా ఢీకొట్టి ముందుకు దూసుకుపోయింది. దీంతో ఫ్లై ఓవర్ కింద నుంచి వెళుతున్న కారు ముందు భాగం తుక్కుతుక్కు అయింది. అదృష్టవశాత్తు ఆ కారులో ఉన్నవారికి తృటిలో ప్రాణాపాయం తప్పింది.

ఫ్లై ఓవర్ కింద చల్లగా ఉంటుందన్న కారణంతో పాటు ప్రజల రాకపోకలు ఎక్కువగా ఉంటాయని ఐస్‌క్రీమ్ విక్రయించే వాహనం, మొక్కజొన్న కండెలు కాల్చేవారు, ఆటోలు, ఇతర వాహనాల పార్కింగ్‌తో అక్కడ పాదచారులు నడిచేందుకు కూడా దారి ఉండని పరిస్థితి. ఈ జంక్షన్‌లో ట్రాఫిక్ పోలీసులు బీట్ ఏర్పాటు చేయడంతో పాటు నాలుగువైపులా జిగ్ జాగ్ బారికేడింగ్ ఏర్పాటు చేసి వాహనాల రద్దీని క్రమబద్ధీకరించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కూడళ్లలో ట్రాఫిక్ నియంత్రించాలి



ముఖ్యమైన కూడళ్లలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా నియంత్రించాలి. పున్నమి హోటల్ (బెరంపార్క్)కు వచ్చే సందర్శకులు, పర్యాటకులు జంక్షన్‌లో నెలకొంటున్న రద్దీని చూసి భయపడుతున్నారు. బెరం పార్క్ లోపలకు వెళ్లాలన్నా, బయటకు రావాలన్నా నాలుగు వైపుల నుంచి వచ్చే వాహనాల రాకపోకలతో ట్రాఫిక్ జామ్ అయి ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయి ఇబ్బందికరంగా ఉంటోంది.

– షేక్ హయాత్ షరీఫ్

తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి



పున్నమి హోటల్ జంక్షన్‌లో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎటు వైపు నుంచి వాహనాలు వస్తున్నాయో తెలియని గందరగోళ పరిస్థితి. పున్నమి హోటల్ ఎదురుగా ఫ్లై ఓవర్ కింద చూస్తే హాకర్ల బెడద. ఏదైనా సందర్భం వస్తే తప్ప పోలీసులు జిగ్‌జాగ్ బారికేడ్లు పెట్టటం లేదు. ఈ జంక్షన్‌లో పోలీస్ బీట్ అయినా ఏర్పాటు చేయాలి లేదా బారికేడ్లు అన్నా ఏర్పాటు చేయాలి.

– బట్టిపాటి శివయ్య యాదవ్

పెనుగొండకు అభినందనలు

విజయవాడకల్చరల్: ఈ ఏడాది కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం పొందిన అభ్యుదయ రచయితల సంఘం(అరసం) జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణకు అరసం కృష్ణాజిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి పరుచూరి అజయ్‌కుమార్, గౌరవ అధ్యక్షుడు కొండపల్లి మాధవరావు బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో అభినందనలు తెలియజేశారు. అరసం ద్వారా మరుగున పడిన సాహిత్యాన్ని వెలుగులోకి తీసుకువచ్చిన ఆయన సాహిత్య కృషికి గుర్తింపు లభించిందన్నారు.

విద్యుత్ భారాలను రద్దు చేయాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రజలపై కూటమి ప్రభుత్వం వేసిన విద్యుత్ భారాలను తక్షణం రద్దు చేయాలని సీపీఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు డిమాండ్ చేశారు. 53వ డివిజన్ శానిటేషన్ కార్యాలయం వద్ద పారిశుద్ధ్య కార్మికుల జనరల్ బాడీ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యబాబు మాట్లాడుతూ విద్యుత్ భారాలను తగ్గిస్తామని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వేలాది కోట్ల రూపాయాల భారాలను వేయటం దారుణమన్నారు. ట్రూఅప్ చార్జీలు, స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న కూటమి ప్రభుత్వం తక్షణం తమ నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని కోరారు. ప్రజలపై భారాలను రద్దు చేసి ప్రత్యామ్నాయ మార్గాల్లో నష్టాలు పూడ్చుకోవాలని చెప్పారు. విద్యుత్ భారాలపై ప్రజలను చైతన్యవం చేయాలని కోరారు.

పండుగల ఆచారాలు ప్రతి ఒక్కరూ పాటించాలి



విజయవాడస్పోర్ట్స్: సన్మార్గంలో నడిపించే పండుగల ఆచారాలు ప్రతి ఒక్కరూ పాటించాలని పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు కోరారు. కమిషనరేట్ కార్యాలయంలో కార్యాలయ పరిపాలన విభాగం బుధవారం నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్ చేశారు. ఏసు క్రీస్తు జన్మదిన వేడుకలు పోలీసు అధికారులు, సిబ్బంది మధ్యలో జరుపుకోవడం తనకు ఎంతో ఆనందదాయకంగా ఉందని ఈ సందర్భంగా కమిషనర్ అన్నారు. అక్కడున్న వారందరికీ ముందస్తుగా క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ అడ్మిన్ డీసీపీ, ట్రాఫిక్ డీసీపీ కృష్ణమూర్తి నాయుడు, కార్యాలయ ఏవో సునీత, జిల్లా పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు సోమయ్య పాల్గొన్నారు.

ఆలోచింపజేసిన 'మనసాక్షి' నాటిక



మనసాక్షి నాటికలో ఒక కీలక సన్నివేశం



మాయలఫకీర్ సీన్‌లో నటీనటుల పద్యాలాపన

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): జాతీయ పెన్షనర్ల దినోత్సవ కార్యక్రమంలో భాగంగా భవానీపురం హౌసింగ్‌బోర్డ్ కాలనీలోగల ఆల్ ఎంప్లాయిస్ పెన్షనర్స్ అసోసియేషన్ మంగళవారం రాత్రి నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ముఖ్యంగా 'మనసాక్షి' నాటిక ప్రేక్షకులను ఆలోచింప చేసింది. మనిషికి కావల్సింది అవినీతితో సంపాదించే డబ్బు కాదని, గుప్పెడు మెతుకులు, ఆరు అడుగుల నేల, చారెడు గుడ్డ అన్న కథాంశంతో కళాకారులు రక్తి కట్టించారు. హర్ష క్రియేషన్స్ (విజయవాడ) పక్షాన నటుడు కత్తి శ్యాం ప్రసాద్ నిర్వహణలో దివంగత డాక్టర్ బ్రహ్మానందం రచించిన ఈ నాటికకు రంగస్థల సీనియర్ నటుడు పిళ్లా నటరాజ్ దర్శకత్వం వహించి నటించారు. వేంపాటి రమేష్, ఎస్.అమృతవర్షిణి, సాగర్, మల్లేశ్వర పట్నాయక్ పాత్రోచితంగా నటించి ప్రేక్షకుల హర్షధ్వానాలు అందుకున్నారు. అనంతరం చింతాడ ప్రసాద్ తన ధ్వన్యనుకరణ (మిమిక్రీ)తో అందరినీ ఆకట్టుకున్నారు. శ్రీసాయిబాబా నాట్యమండలి (విజయవాడ) ఆధ్వర్యంలో కళాకారిణులు జీఎన్‌డీ కుసుమసాయి, బత్తిన రూపశ్రీ, చిందాన తేజశ్రీ ఆంధ్ర నాట్యం, కూచిపూడి, భరత నాట్యంతో పలు అంశాలకు చక్కని ఆంగికాభినయంతో నర్తించారు. శ్రీదేవి కళా నాట్య మండలి (ఉయ్యూరు) వారు బాలనాగమ్మ నాటకం నుంచి 'మాయలఫకీర్' సీను ప్రదర్శించారు. ఈ సీనులో జెట్టి నరసింహారావు, కణితి ప్రభావతి నటించగా, చింతలపూడి నాగేశ్వరరావు బృందం వాయిద్య సహకారం అందించారు. ఏపీ రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి సహకారంతో పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సూరిశెట్టి వెంకటేశ్వరరావు, సందక కృష్ణ, కోశాధికారి యెనిగళ్ల సుబ్బారావు, సభ్యులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

గణితంపై పట్టుతో ఉద్యోగావకాశాలు

హైదరాబాద్ జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ కె.వెంకటేశ్వరరావు



బహుమతులు అందజేస్తున్న హైదరాబాద్ జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ కె.వెంకటేశ్వరరావు

గుణదల(విజయవాడ తూర్పు): విద్యార్థులు గణితశాస్త్రంపై పట్టు సాధించడం ద్వారా భవిష్యత్‌లో ఉద్యోగ అవకాశాలు మెండుగా లభించే అవకాశం ఉంటుందని హైదరాబాద్ జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఆంధ్రలయోల కళాశాలలో గణిత-24 పేరిట గణిత మహోత్సవం బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు మిగతా పాఠ్యాంశాల కంటే ఎక్కువగా గణితంలో పట్టు సాధించాలని సూచించారు. ఆధునిక ప్రపంచంలో గణిత శాస్త్రానికి ప్రాముఖ్యత పెరుగుతుందని చెప్పారు. మెరుగైన ఉద్యోగ అవకాశాలకు, పారిశ్రామిక, వ్యాపార రంగంలో గణితానికి అత్యధిక ప్రాధాన్యం ఉందని పేర్కొన్నారు. గణితం నేర్చుకునే తొలి దశలో కొంత కఠినంగా ఉన్నా సూత్రాల ద్వారా సులువుగా పూర్తి చేయవచ్చని తెలిపారు. గణితం కఠిన తరమనే భావన విద్యార్థులు విడిచిపెట్టాలని సూచించారు. విద్యార్థుల్లో గణితశాస్త్రంపై అవగాహన కల్పించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయని వెల్లడించారు. అనంతరం విద్యార్థులకు గణితంలో క్విజ్, మెమొరీ గ్రిడ్, క్యూబ్ సాల్వింగ్, పోస్టర్ ప్రజెంటేషన్ వంటి అంశాల్లో పోటీలు నిర్వహించారు. మంచి ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో లయోల కళాశాల ప్రిన్సిపల్ ఫాదర్ కిషోర్, గణిత శాస్త్ర విభాగాధిపతి పి.వేణుగోపాల్ అధ్యాపకులు తబిత, నాగకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు పరవస్తు చిన్నయ్య సూరి జయంతి

భవానీపురం(విజయవాడపశ్చిమ): తెలుగు భాషకు ప్రామాణికమైన బాల వ్యాకరణం రచించి, గద్య రచనకు నీతి చంద్రిక ద్వారా ఒక వరవడిని సృష్టించి తెలుగు భాషకు శాశ్వతత్వాన్ని కలుగచేసిన కవి పరవస్తు చిన్నయ్య సూరి 218వ జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు చిన్నయ్య సూరి సాహితీ పీఠం అధ్యక్ష, కార్యదర్శులు టి.శోభనాద్రి, ఎస్‌సీ శేషగిరిరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 20వ తేదీ సాయంత్రం 3 గంటలకు బందరు రోడ్‌లోని ఠాగూర్ గ్రంథాలయంలో ఈ వేడుకలను నిర్వహించనున్నట్లు తెలిపారు. చిన్నయ్య సూరి జీవిత చరిత్ర, ఆయన రచనలను పొందుపరుస్తూ రచయితలు ఆచార్య వెలమల సిమ్మన్న, డాక్టర్ గుమ్మా సాంబశివరావు రచించిన 'శబ్ద బ్రహ్మ చిన్నయ్య సూరి' గ్రంథావిష్కరణ ఉంటుందని పేర్కొన్నారు. ఈ గ్రంథాన్ని తెలుగు విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ఆచార్య వెలుదండ నిత్యానందరావు ఆవిష్కరిస్తారని తెలిపారు. అద్దంకికి చెందిన తెలుగు పండిట్ కేశవమఠం అనిల్ కుమార్ సూరి గ్రంథ సమీక్ష చేస్తారన్నారు.

22న సీనియర్ సిటిజన్స్ సంఘం రజతోత్సవ సభ

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఉమ్మడి కృష్ణా జిల్లా సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రజతోత్సవ సభను ఈ నెల 22వ తేదీ మొగల్రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో నిర్వహిస్తున్నామని ఆ సంఘం ప్రధాన కార్యదర్శి మోతుకూరి వెంకటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన వయో వృద్ధులకు సన్మానాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తామని చెప్పారు. ఈ వేడుకలకు ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ, వృద్ధుల సంక్షేమ శాఖా మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి, స్త్రీ, శిశు సంక్షేమ, విభిన్న ప్రతిభా వంతులు, వృద్ధుల సంక్షేమ శాఖా కార్యదర్శి ఎ.సూర్యకుమారితో పాటుగా ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు, ఉమ్మడి తెలుగు రాష్ట్రాలు నుంచి అధిక సంఖ్యలో సీనియర్ సిటిజన్లు హాజరవుతారని పేర్కొన్నారు.

42 మంది ఉద్యోగాలకు ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల ప్రతినిధులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): తమ కళాశాలలో బీఎస్సీ, బీసీఏ, బీబీఏ, బీకామ్ చివరి సంవత్సరం చదువుతున్న 42 మంది విద్యార్థులు ఎక్సెంచ్యూర్ ఐటీ సంస్థలో సిస్టం అండ్ అప్లికేషన్ సర్వీసెస్ అసోసియేట్ ఉద్యోగాలకు ఎంపికయ్యారని పీబీ సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్ చెప్పారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల ఆవరణలో బుధవారం అభినందించారు. రమేష్ మాట్లాడుతూ గత నెలలో తమ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన క్యాంపస్ రిక్రూట్‌మెంట్ పరీక్షలో ప్రతిభ చూపిన వారికి ఆన్‌లైన్ ద్వారా ఇంటర్వ్యూలను నిర్వహించారని చెప్పారు. వాటి ఫలితాలు ఇటీవల ప్రకటించారని తెలిపారు. క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో ఉద్యోగాలకు ఎంపికైన వారిలో అత్యధికంగా తమ కళాశాలకు చెందిన 42 మంది ఉద్యోగాలు పొందడం తమకు చాలా సంతోషంగా ఉందని కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు అన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల ఉపాధి విభాగం అధికారి కావూరి శ్రీధర్, సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు మలినేని రాజయ్య, కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, కళాశాల కన్వీనర్ సూరెడ్డి వెంకటేశ్వరరావు, కళాశాల డీన్ రాజేష్ సీ. జంపాలతో పాటుగా అధ్యాపకులు అభినందించారు.











భవానీ దీక్షల విరమణకు ఏర్పాట్లు

ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన దుర్గమ్మ సన్నిధిలో భవానీ దీక్షల విరమణలకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. వినాయక గుడి కెనాల్ రోడ్డు వైపు నుంచి ఘాట్ రోడ్డు వరకు క్యూలైన్లు సిద్ధం చేస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా భారీ టెంట్లు అమర్చుతున్నారు. పవిత్ర పుణ్యస్నానాల కోసం భవానీ ఘాట్ వద్ద జల్లు స్నానాలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ







ట్రాఫిక్ పోలీసులకు కళ్లజోళ్లు పంపిణీ



విజయవాడ స్పోర్ట్స్: ట్రాఫిక్ పోలీసుల ఆరోగ్యం, శ్రేయస్సు కాంక్షిస్తూ వారికి అగర్వాల్ కంటి ఆసుపత్రి యాజమాన్యం సన్ గ్లాసెస్(కళ్లజోళ్లు) పంపిణీ చేయడం పట్ల పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు హర్షం వ్యక్తం చేశారు. ట్రాఫిక్ పోలీసులకు అగర్వాల్ కంటి ఆసుపత్రి సమకూర్చిన కళ్ల జోళ్లను గవర్నర్ పేటలోని ఆసుపత్రి ప్రాంగణంలో బుధవారం పంపిణీ చేశారు. అనంతరం పోలీసు అధికారులు, సిబ్బందికి, వారి కుటుంబ సభ్యులకు ఉచితంగా కంటి పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆసుపత్రి మెడికల్ డైరెక్టర్ డాక్టర్ కె.కె.ఎస్.చక్రవర్తి, ట్రాఫిక్ డీసీపీ కృష్ణమూర్తి నాయుడు, ఏడీసీపీ ఎ.వి.ఎల్. ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.